క్లుప్తంగా

జగన్నాథుని రథం సిద్ధం



జగన్నాథుని రథం

శ్రీకాకుళం కల్చరల్: బొందిలీపురంలో జగన్నాథస్వామి దేవాలయంలో ఈ నెల 20 నుంచి జరిగే రథయాత్ర కోసం నిర్వాహకులు రథాన్ని సిద్ధం చేశారు. జగన్నాథుని ఆలయం నుంచి గుడించా వద్దకు స్వామివారిని తీసుకొచ్చేందుకు, మళ్లీ తిరిగి తీసుకెళ్లేందుకు నూతన రథాన్ని సిద్ధం చేసినట్లు నిర్వాహకులు లక్ష్మీదార్‌దాస్ బావాజీ, ఆలయ మేనేజర్ కోండ్రు పురుషోత్తం తెలిపారు.

నట్టల నివారణ మందులు పంపిణీ



నట్టల నియంత్రణ మందులు వేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: అజ్జరాం గ్రామంలో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్ ఈశ్వరరావు మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు తప్పని సరిగా నట్టలు నియంత్రణ మందులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రవంతి, ఎంపీటీసీ గోవింద, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు జంక్షన్ వద్ద అయ్యప్ప వెల్డింగ్ షాపు సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమదాలవలస మండలం కొర్లకోట గ్రామానికి చెందిన గురుగుబెల్లి అమర్‌నాథ్(37) మృతి చెందాడు. వ్యక్తిగత పనిమీద శ్రీకాకుళం వచ్చి తిరిగి రాత్రి 10 గంటల సమయంలో బైక్‌పై స్వగ్రామం వెళ్తుండగా రాగోలు వద్ద ఐచర్ వ్యాన్ వెనుక నుంచి ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో అమర్‌నాథ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రి గురుగుబెల్లి అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు అమర్‌నాథ్ విదేశాల్లో షిప్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 12 భార్య, పిల్లలను చూసేందుకు స్వగ్రామం వచ్చాడు. ఇంతలోనే ఈ ప్రమాదం జరగడంతో స్వగ్రామంలో విషాధచాయలు అలముకున్నాయి.

కుడికాలువ మరమ్మతులు చేపట్టాలి

ఎచ్చెర్ల క్యాంపస్ : ఎచ్చెర్ల మండలానికి సాగునీరు అందించే నారాయణపురం కుడికాలువ మరమ్మతులు చేపట్టాలని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు కాలువను శుక్రవారం పరిశీలించారు. శివారు భూముల రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మోహనరావు, చంద్రరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం

ఎచ్చెర్ల: రైతులు ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యమివ్వాలని కేశవరావుపేట యూనిట్ ఇన్‌చార్జి వై.చంద్రకళ తెలిపారు. శుక్రవారం ఫరీద్‌పేటలో సూర లక్ష్మునాయుడు క్షేత్రంలో 2 వేల కేజీల ఘన జీవామృతం తయారు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలుపు నివారణకు రసాయన ఎరువులు వాడటంతో భూమి సారం కోల్పోతుందన్నారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన వినతుల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాలరావు

జి.సిగడాం: స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో వస్తున్న వినతుల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వేపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ నిశ్చల, మండల పంచాయతీ అధికారి ఎస్.శ్రీనివాసరావు, ఎంఈఓ అరసాడ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ



నివాళులు అర్పిస్తున్న సాయికుమార్

రణస్థలం: మండలంలోని వల్లభరావుపేట వైఎస్సార్‌సీపీ నాయకులు గడి రమణ తల్లి గడి వరలక్ష్మి శుక్రవారం మరణించారు. ఆమె పార్థివదేహానికి వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గురాన చిరంజీవి, మహంతి సత్యనారాయణ, గడి బలరాం, గడి బాబురావు, బొంతు జగన్, రెడ్డి సురేష్, కిర్తీ మంగ, పిల్ల కోటి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించుకోవాలి

- కృష్ణా యూనివర్సిటీ ప్రొఫెసర్ వి.బ్రహ్మచారి
- శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో ముగిసిన రెండురోజుల జాతీయ సదస్సు

శ్రీకాకుళం న్యూకాలనీ:



సర్టిఫికెట్లను అందుకున్న విద్యార్థులతో ప్రొఫెసర్ విజయన్, ప్రిన్సిపాల్ సురేఖ, ప్రదీప్, హరిత తదితరులు

విద్యార్థులు అకాడమిక్ సిలబస్‌తోపాటు పరిశోధన రంగం, మన చుట్టూ జరుగుతున్న వాస్తవిక పరిస్థితులకు ఉపయోగపడేలా శాస్త్రీయ విజ్ఞానాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నం చేయాలని కృష్ణా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ వి.బ్రహ్మచారి అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, జంతుశాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయో టెక్నాలజీ–సెర్బ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కొచ్చిన్ యూనివర్సిటీకి చెందిన భారత జీవ సాంకేతికశాస్త్ర మండలి అధ్యక్షుడు ప్రొఫెసర్ ఇ.విజయన్ మాట్లాడుతూ ఇటువంటి జాతీయ సదస్సుల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు మరింత పరిపక్వత సాధించవచ్చని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఈ కళాశాలలో ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తుండటం శుభపరిణామమని పేర్కొన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

- కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ మాట్లాడుతూ శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల త్వరలో నాక్ అక్రిడియేషన్‌కు వెళ్లబోతుందని చెప్పారు. ఇటువంటి సెమినార్లు, వర్క్‌షాప్‌లు నిర్వహించడం నాక్ గ్రేడింగ్‌కు మరింత ఉపయుక్తమౌతుందన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా సెమినార్లు, వర్క్‌షాప్‌లను నిర్వహిస్తున్న ఘనత కళాశాలకు చెందిన జీవ సాంకేతికశాస్త్ర విభాగాధిపతి ఎం.ప్రదీప్‌కే దక్కుతుందని ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులను తీర్చిదిద్దాలని, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. కన్వీనర్ ఎం.ప్రదీప్ మాట్లాడుతూ రెండు రోజుల జాతీయ సదస్సు ఉద్దేశాన్ని వివరించారు. జాతీయ సదస్సును విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ప్రొఫెసర్ విజయన్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు బహూకరించారు. కార్యక్రమంలో సెమినార్ కోఆర్డినేటర్ డాక్టర్ వై.పోలినాయుడు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్, సెమినార్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ రోణంకి హరిత, రవిబాబు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న డిగ్రీ సెకెండియర్ బయోటెక్ విద్యార్థిని వనిత

మూఢ నమ్మకాలు వీడాలి



మాట్లాడుతున్న సీఐ సన్యాసినాయుడు

గార: మూఢ నమ్మకాలను వీడి అందరూ ఐకమత్యంగా ఉండాలని శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ ఎన్.సన్యాసినాయుడు అన్నారు. శుక్రవారం మొగదాలపాడులో అవగాహన సమావేశం నిర్వహించారు. ముందుగా శాంతి కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ అనుమానాలు పెట్టుకోవడం వల్ల గ్రామంలో ఓక వ్యక్తిని కోల్పోయిన ఘటన ఇటీవల జరిగిందన్నారు. మరో కుటుంబం కూడా బలైపోయిన పరిస్థితి వచ్చిందన్నారు. సైన్సు అభివృద్ధి చెందిన తర్వాత ఇంకా మూఢ నమ్మకాలు పెట్టుకోవడం మంచిది కాదన్నారు. గ్రామస్తులంతా కలిసిమెలిసి ఉండాలని హితవుపలికారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎన్.సన్యాసినాయుడు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి పనులు.. గడపగడపతో సాకారం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గడపగడపకు– మన ప్రభుత్వం కార్యక్రమంతో గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు చక్కటి పరిష్కారం లభిస్తోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలం మండలం తెప్పలవలస గ్రామ సచివాలయ పరిధిలో కొత్తపేట, చిన్న పట్నానపేట, నీలంపేట, తెప్పలవలస గ్రామాల్లో శుక్రవారం గడపగడపకు–మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లు పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

కొత్తపేటలో సీసీ కాలువ, రోడ్లు, విద్యుత్ స్తంభాలు వేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలందరికి సంపూర్ణంగా సంక్షేమ పథకాలు అందించి ఇంటింటా సంతోషాలు కురిపిస్తున్న సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయిపురెడ్డి భుజంగరావు, మండల నాయకులు లంకలపల్లి ప్రసాద్, మహంతి పెదరామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, మైలపల్లి కామరాజు, గొర్లె అప్పలన ర్సునాయుడు, మహంతి చినరామినాయుడు, బడి రాంబాబు, తెప్పలవలస పంచాయతీ సర్పంచ్ బొమ్మలాట సంతోషి, ఎంపీటీసీ చోడవరపు శాంతమ్మ, నాయకులు దన్నాన హరి, బొమ్మలాట శ్రీరాములు, అచ్చోడు, కొయ్యి సోములరెడ్డి, దన్నాన నర్సునాయుడు, మీసాల గాంధీ, తోట అప్పన్న, తోట ఆదినారాయణ, బుడుమూరు యల్లారావు, పట్నాన పెంటయ్యరెడ్డి, సింహాద్రి, యాగాటి నాగరాజు, దుంగ రాముడు, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, వార్డు మెంబర్లు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అసైన్డ్ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని వినతి



మంత్రితో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

శ్రీకాకుళం రూరల్/శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూముల కొనుగోలు, అమ్మకాలు జరగకుండా పక్కాగా చట్టాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి సింహాచలం, జిల్లా ఉపాధ్యక్షురాలు ఈశ్వరమ్మ కోరారు. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు పెదపాడులోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ ప్రజాసంఘాలు, ప్రజల అభిప్రాయం మేరకు ప్రభుత్వం చట్టం చేస్తోందని, పేదలకు అన్యాయం జరగకుండా చూస్తామని హామీఇచ్చారు.

ఐసెట్‌లో విద్యార్థిని ప్రతిభ

శ్రీకాకుళం: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో చేరడానికి నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఐసెట్‌లో శ్రీఆకాశ కెరీర్స్ గైడెన్సు విద్యార్థిని పి.శ్రీసాయివిద్య 639వ ర్యాంకు సాధించిందని సంస్థ డైరెక్టర్ సీహెచ్ వెంకట్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందిన అందరి విద్యార్థులంతా క్వాలిఫై అవ్వడమే కాకుండా సీట్లు వచ్చేలా ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



తాళ్లవలసలో నిల్వ నీటిని బయటకు పారబోస్తున్న సిబ్బంది

లావేరు: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది గ్రామస్తులకు సూచించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో శుక్రవారం డ్రై ఫ్రైడే అమలు చేశారు. జనావాసాల మధ్య మురుగునీరు నిల్వ ఉండకుండా, చెత్తకుప్పలు లేకుండా చర్యలు తీసుకున్నారు. కాలువల్లో పూడికలు తొలగించారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రజా సంక్షేమం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. భగీరథపురంలో శుక్రవారం పల్లెపల్లెకు ఎంపీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయం యూనిట్‌గా అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామ సచివాలయం, గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా పథకాలు పారదర్శకంగా వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. భగీరథపురంలో స్వయం సహాయ సంఘాల మహిళలకు రూ.2.90 కోట్ల మేర లబ్ధి చేకూరిందని వివరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు మాడుగుల మురళీధర్‌బాబా, నాయకులు బెండు రామారావు, బగ్గు రాజారావు, నక్క కృష్ణమూర్తి, మూగి శ్రీరాములు, సర్పంచ్ నక్క లక్ష్మి, ఎంపీటీసీ కొమర సోమయ్య, గొలివి అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

సంతోషిమాతకు పూజలు



పూజలందుకుంటున్న సంతోషిమాత

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలో సంతోషిమాత అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ నేతృత్వంలో అమ్మవారికి అష్టోత్తర శతనామాలతో శ్రీచక్ర పూజలు చేసి ఉద్యాపనులు, మహా నివేదన, మహా హారతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులు



కేజీబీవీలో జగనన్న విద్యాకానుకలు పంపిణీ చేస్తున్న నాయకులు

జి.సిగడాం : పేద పిల్లలకు సైతం కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ విద్యనందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ అన్నారు. శుక్రవారం స్థానిక కేజీబీవీలో జగనన్న విద్యాకానుకలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసినప్పుడు మంచి ఫలితాలు సాధించగలమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బూరాడ వెంకటరమణ, పీఏసీఎస్ చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు, ఎంఈఓ అరసాడ రవి, ప్రిన్సిపాల్ ఉషారత్నంకుమారి, సర్పంచులు తొత్తడి రామారావు, మహాదాస్యం నారాయణరావు, పాఠశాల కమిటీ చైర్మన్ సింహాచలం, సిబ్బంది పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేద్దాం



కొత్త ఎంపీడీఓను అభినందిస్తున్న ఉపాధి సిబ్బంది

జి.సిగడాం: అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని ఎంపీడీఓ నిశ్చల అన్నారు. శుక్రవారం జి.సిగడాం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ అంకితభావంతో పని చేయాలన్నారు. పంచాయతీ రాజ్, ఉపాధి పనుల నిర్వహణలో జి.సిగడాం మండలం మొదటి స్థానంలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కొత్త ఎంపీడీఓను సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈఈ శ్రీవల్లి, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, టీఏలు లక్ష్మణరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాస శివరాత్రి పూజలు



ఉమాజఠలేశ్వరునికి ప్రత్యేక అలంకరణ



రాజరాజేశ్వరీ పీఠంలో ఈశ్వరునికి పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అశ్వినీకుమార్, మహేష్‌ల ఆధ్వర్యంలో స్వామివారికి నారికేళజలం, గంధం జలంతో అభిషేకాలు జరిగాయి. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. గుజరాతిపేటలోని రాజరాజేశ్వరీ లలితా త్రిపుర మహా సుందరి దేవీ పీఠంలో మాస శివరాత్రి సందర్భంగా పెంట రామ చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం



బొంతలకోడూరు విదార్థులను సత్కరిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన బొంతలకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు బి.ఆనందరావు, సర్పంచ్ పి.రాంబాబు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన వీహెచ్ జగదీష్, ఐ.జ్యోత్స్న, వి.హరిప్రసాద్‌లకు నగదు, ప్రశంసాపత్రాలను అందించి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ఎం.జగదీశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సినీ గాయనిగా 'తరుణి'



గీతాలు ఆలపిస్తున్న తరుణి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుజరాతీపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పాట్నూరు తరుణికి మొదటిసారిగా సినిమాలో ప్లేబ్యాక్ సింగర్‌గా అవకాశం లభించింది. లహరి మ్యూజిక్ అండ్ చాయ్ బిస్కెట్ సంయుక్తంగా నిర్మించిన 'మేమ్ ఫేమస్' సినిమాలో సంగీత దర్శకులు కల్యాణ్ నాయక్ నేతృత్వంలో రెండు గీతాలను ఆలపించినట్లు ఆమె తెలిపారు. టైటిల్ సాంగ్‌ను ప్రముఖ సినీ గాయని మంగ్లీతో కలిసి పాడగా, రెండో పాట సోలోగా పాడినట్లు చెప్పారు. ఈ సినిమాకు సుమంత్ ప్రభాస్ దర్శకుడు. గాయనిగా అవకాశం రావడం చాలా ఆనందంగా ఉందన్నారు.

లక్ష్యాలను పూర్తి చేయండి



సమీక్షలో పీడీ విద్యాసాగర్ తదితరులు

నరసన్నపేట: నిర్దేశించిన లక్ష్యాలను గ్రామస్థాయిలో సీసీలు, సీఏలు, మండల కేంద్రాల్లో వెలుగు సిబ్బంది పూర్తి చేయాలని డీఆర్‌డీఏ పీడీ డీవీవీ విద్యాసాగర్ అన్నారు. నరసన్నపేటలోని వెలుగు కార్యాలయంలో నరసన్నపేట, గార, జలుమూరు, పోలాకి, శ్రీకాకుళం రూరల్ మండలాలకు సంబంధించిన సిబ్బందితో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. బ్యాంకు లింకేజీలు, వైఎస్సార్ బీమాతో పాటు పలు పథకాల అమలుపై సమీక్ష చేపట్టారు. సంఘాలు, రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. సమావేశంలో ఎంపీడీవో మధుసూదనరావు, ఏసీ కొండలరావు, ఏపీఎం సాయిలక్ష్మి, హేమ సుందరరావు, అప్పలరామయ్య పాల్గొన్నారు.

జల జీవన్ మిషన్ పనుల పరిశీలన



కమ్మసిగడాంలో మంచినీటి సరఫరా పనులపై ఆరా తీస్తున్న సభ్యులు

రణస్థలం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికి మంచినీటి సరఫరా పనులను ఎన్‌జేజేఎం సభ్యులు సీహెచ్ విద్యా ప్రణయదీప్, ఏంజల్ ప్రణయదీప్‌లు శుక్రవారం పరిశీలించారు. కమ్మసిగడాం పంచాయతీలో రూ.40 లక్షల నాబార్డ్ నిధులతో వేసిన ఇంటింటికి మంచినీటి సరఫరా పైపులైన్లు, ట్యాపుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామ పరిస్థితులపై పాఠశాల, అంగన్‌వాడీ, స్థానిక లబ్ధిదారులతో మాట్లాడారు. పంచాయతీ సిబ్బంది, సర్పంచ్ రవణమ్మలను నుంచి సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ప్రతి ఇంటికి శుద్ధజలం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామారావు, జిల్లా పర్యవేక్షణ సమన్వయకర్తలు డి.దాలినాయుడు, ఎస్.మురళీమోహన్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ, గ్రామపెద్దలు సింక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.